క్లుప్తంగా

సాఠే అడుగుజాడల్లో నడవాలి


నివాళులర్పిస్తున్న నాయకులు

తానూరు: ప్రతి ఒక్కరూ సాహిత్యరత్న అన్నాభావు సాఠే అడుగుజాడల్లో నడవాలని మాజీ సర్పంచ్ సత్యనారాయణ్ పటేల్ అన్నారు. శనివారం మండలంలోని సింగన్‌గాం గ్రామంలో అన్నాభావు సాఠే 104వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయినాథ్, బాలాజీ, ఖండురావ్, ధర్మాజీ, ప్రకాశ్, భోజారం, ఆనంద్, శంకర్, బాలాజీ, అన్నాభావు సాఠే కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పార్‌పెల్లిలో వైద్యశిబిరం

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని పార్‌పెల్లిలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందించారు. ఆరోగ్య సహాయకుడు శివకృష్ణ, ఆరోగ్య కార్యకర్త కల్యాణి, ఆశవర్కర్లు గంగామణి, కళ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

అలివేలుమంగ శ్రీనివాసుల కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న పండితులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బాలాజీవాడలో కొలువైన అలివేలు మంగ ఆలయంలో శుక్రవారం రాత్రి అలివేలు మంగ శ్రీనివాసుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకొని సుదర్శన యాగ సమితి ఆధ్వర్యంలో కళ్యాణం జరిపించారు. స్వామివారిని వీరాంజనేయ దేవస్థానం నుంచి మహిళలు కోలాట నృత్యాల నడుమ ఎదుర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు రామకన్నన్, తిరుమల మోహన చార్యులు, అమెడ శ్రీధర్, డాక్టర్ బీఎల్ఎన్ రెడ్డి, అఖిల, ప్రవీణ్, పూసల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత


చెక్కులు అందిస్తున్న నారాయణ్‌రావ్

భైంసా: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పటేల్ భైంసాలోని తన నివాసంలో శనివారం ఆయా మండలాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రకాంత్ యాదవ్, శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, షఫీ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్యూరిఫయర్ అందజేత


ప్యూరిఫయర్ అందిస్తున్న దాతలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బొశెట్టి నర్సయ్య, అతని కుమారుడు శివ రూ.12వేల విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను శనివారం విరాళంగా అందజేశారు. వర్షాకాలంలో విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో వాటర్ ప్యూరిఫైడ్ అందజేసినట్లు పేర్కొన్నారు. హెచ్ఎం నరేందర్‌రావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: శ్రావణమాస శనివారం పురస్కరించుకొని మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయం, ఓలా దొనెల్లి శివా లయం, కుంటాలలోని మహదేవుని, ఉమామహేశ్వర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూ జలు నిర్వహించారు. శివలింగానికి గంగాజలంతో అభిషేకం, బిల్వార్చన, అన్నపూజ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సూర్యాపూర్‌లో కుంటాలకు చెందిన కక్కెర రజిత–ముత్యంరావు దంపతులు అన్నదానం చేశారు.

కాలినడకన కదిలె..


పాదయాత్రగా కదిలెకు వెళ్తున్న భక్తులు (ఫైల్)

- ఏటా శ్రావణమాసంలో పాదయాత్ర
- జిల్లాకేంద్రం నుంచి పాపహరేశుడి దాకా
- 18న ప్రారంభం
- సాయిదీక్ష సేవాసమితి ఆధ్వర్యంలో తొమ్మిదోసారి

నిర్మల్: ఆధ్యాత్మికతకు నిలయమైన శ్రావణమాసం నిత్యపూజలతో, వారానికో పండుగతో సందడిగా సాగుతోంది. హరిహరులకు ప్రీతిపాత్రమైన ఈనెలలో భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. రాష్ట్రంలోనే అరుదైన ఆలయాల్లో ఒకటిగా పేరున్న కదిలె పాపహరేశ్వరాలయానికీ ఈ మాసంలో భక్తులు పోటెత్తుతున్నారు. ఏటా శ్రావణమాసంలో చేపడుతున్నట్లే జిల్లాకేంద్రం నుంచి కదిలె వరకు ఈసారీ పాదయాత్ర చేసేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. ఇందుకు సాయిదీక్ష సేవాసమితి ఏర్పాట్లు పూర్తిచేస్తోంది.


కదిలె పాపహరేశ్వరాలయం

ప్రత్యేకం ఈ ఆలయం..

సహ్యాద్రి పర్వతాల చివరి సానువుల్లో వెలసిన దర్శనీయ స్థలం కదిలె. దిలావర్‌పూర్ మండలంలోని గుట్టల నడుమ మాతాన్నపూర్ణ సమేతుడై పాపహరేశ్వరుడు కొలువై ఉన్నాడు. ఘాట్ రోడ్డు గుండా సాగే ప్రయాణం, చుట్టూ ఎత్తయిన గుట్టలు, దట్టమైన చెట్ల మధ్య.. లోయలో ఈ ఆలయం ఉంటుంది. ఎప్పుడూ ప్రవహించే జీవజలం ఒడ్డున ప్రశాంతంగా కొలువైన కోవెలను ఒక్కసారి దర్శిస్తే మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది. కుటుంబసభ్యులంతా కలిసి వెళ్తూ ఆధ్యాత్మికతతో పాటు పర్యాటకానందాన్నీ ఆస్వాదిస్తుంటారు. ఇక్కడి రాజకీయ, సినిమారంగాలకు చెందిన పలువురు ప్రముఖులూ ఈ ఆలయ దర్శనానికి వస్తుంటారు.

పాదయాత్రగా వెళ్లి..

ప్రతీ శ్రావణ మాసంలో కదిలె పాపహరేశ్వరుడి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివెళ్తున్నారు. జిల్లాకేంద్రం నుంచి ప్రతీఏడాది సాయిదీక్ష సేవాసమితి ఆధ్వర్యంలో కదిలె దాకా పాదయాత్ర చేపడుతున్నారు. తొమ్మిదేళ్లుగా కాలినడకన ఈ యాత్ర చేపడుతుండటం విశేషం. దాదాపు 20 కిలోమీటర్ల దూరం సాగే ఈ పాదయాత్రలో పాల్గొనే భక్తులకు సేవాసమితి అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

> **తొమ్మిదోసారి కాలినడకన..**
>
> జిల్లాకేంద్రం నుంచి కదిలె పాపహరేశ్వరాలయం వరకు ప్రతీ శ్రావణమాసంలో పాదయాత్ర చేపడుతున్నాం. ఈనెల 18న విజయవంతంగా తొమ్మిదోసారి కాలినడకకు ఏర్పాట్లు చేశాం. స్థానిక నటరాజ్‌నగర్ ఉమామహేశ్వరాలయం నుంచి సోమవారం ఉదయం 8 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరుతున్నాం.
>
> – లక్కడి జగన్‌మోహన్‌రెడ్డి, సాయిదీక్ష సేవా సమితి

పొంగిన వాగులు, వంకలు


కడెం: కోతకు గురైన అల్లంపల్లి మట్టి రోడ్డు


ధర్మాజీపేట్ సమీపంలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు

- జిల్లాను ముంచెత్తిన వర్షం
- దెబ్బతిన్న రోడ్లు, పంటలు
- ఉధృతంగా వంతెనలపై వరద ప్రవాహం
- రాకపోకలకు తీవ్ర అంతరాయం

కడెం: భారీవర్షాలు జిల్లాను ముంచెత్తడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కడెం మండలంలోని గంగాపూర్, అల్లంపల్లి, ఇస్లాంపూర్, మిద్దెచింత తదితర మారుమూల గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. వరదకు పొలాల వద్ద ఉన్న మోటార్లు కొట్టుకుపోయినట్లు రైతులు వాపోయారు. ధర్మాజీపేట్ సమీపంలో నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారిపై చెట్టు విరిగి పడింది. తహసీల్దార్ ప్రభాకర్, ఎస్సై సాయికిరణ్ అక్కడికి చేరుకుని జేసీబీ సహాయంతో చెట్టును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పలు గ్రామాల్లో వరద ఉధృతికి పంటలు దెబ్బతిన్నాయి.

లోకేశ్వరం: ఎగువ ప్రాంతాల వరద గోదావరిలో చేరడంతో మండలంలోని పంచగుడి గ్రామ సమీపంలోని వంతెన వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎస్సారెస్పీలో నీటిమట్టం పెరుగుతుండటంతో పురాతన శివాలయం చుట్టూ వరద చేరుతోంది.

ఖానాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు లేకపోవడంతో వరద రోడ్లపై నిలువడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సత్తనపల్లి గ్రామంలోని పెంబి వెళ్లే రోడ్డు కుంటను తలపిస్తోంది. మస్కాపూర్‌లో డ్రెయినేజీల్లో పూడిక తీయకపోవడంతో వరద రోడ్డుపై ప్రవహిస్తోంది. పట్టణంతో పాటు పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఖానాపూర్ పట్టణంలో 30.8 మి.మీ వర్షపాతం, మండలంలోని పాతఎల్లాపూర్‌లో 25.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.


ఖానాపూర్ : సత్తనపల్లిలో కుంటను తలపిస్తున్న పెంబి వెళ్లే ప్రధాన రహదారి

కుంటాల: మండలంలోని గ్రామాల్లో శనివారం వేకువజాము నుంచి భారీ వర్షం కురిసింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కుంటాలలోని మైసమ్మ కాలనీ జలమయం కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. 43 మీ. మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ సాయికృష్ణ తెలిపారు.

కృష్ణాష్టమి వేడుకలు


నిర్మల్‌లోని గండి రామన్న ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల/లక్ష్మణచాంద/లోకేశ్వరం/ముధోల్/నిర్మల్‌టౌన్/దిలావర్‌పూర్/ఖానాపూర్: మండలాల్లోని ఆయా గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు పాఠశాలల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. పలుచోట్ల ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లక్ష్మణచాంద మండలంలోని మల్లాపూర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి అన్నదానం చేశారు. నిర్మల్‌లోని మంజులాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో, మురళీకృష్ణ ఆలయంలో శ్రీకష్టాష్టమి వేడుకలు, సుందర సత్సంగ్ నిర్వహించారు. గండిరామన్న దత్త సాయి ఆలయ ఆవరణలో శ్రీకష్ణుడి విగ్రహానికి పూజలు చేశారు.


నిర్మల్‌లోని మంజులాపూర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న యాదవ సంఘం సభ్యులు


కుంటాల: కల్లూరు కేజీబీవీలో ఆకట్టుకున్న గోపికల వేషధారణ


ముధోల్ : సరస్వతీ శిశుమందిర్‌లో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

పరిపాలన దార్శనికుడు వాజపేయి

నిర్మల్‌చైన్‌గేట్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి పరిపాలన దార్శనికుడని బీజేపీ నాయకులు అన్నారు. శనివారం వాజపేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి సుపరిపాలనకు నిదర్శనమని, అట్టడుగుస్థాయిలో ఉన్న నిరుపేదకు ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. స్వర్ణ చతుర్భుజి కార్యక్రమంతో ఈ దేశంలో ఎన్నో రోడ్లను నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యగారు భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆడేపు సుధాకర్, ఉపాధ్యక్షులు అలివేలుమంగ, కమల్ నయన్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ దశరథ్ పోశెట్టి, ఆడెపు లలిత, అయ్యన్నగారి రాజేందర్, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోట సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ అల్లం భాస్కర్, పట్టణ ఉపాధ్యక్షులు వడ్నాల రాజు, సీనియర్ నాయకులు పంతికె ప్రకాశ్, గుర్రం నరసయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వర్షంలోనూ విధులు


విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కుంటాల: భారీ వర్షాన్ని లెక్కచేయకుండా మండలకేంద్రమైన కుంటాలలో శనివారం పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తించారు. ఇంటింటికీ వెళ్లి పంచాయతీ ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరించి డంపింగ్‌యార్డ్‌కు తరలించారు.

చెక్‌డ్యాంకు జలకళ..!

కుంటాల: ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి చేరడంతో మండలంలోని కల్లూరు చెక్ డ్యాం పరవళ్లు తొక్కుతోంది. చెక్ డ్యాం పైనుంచి నీరు ఎత్తిపోయడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. సెల్ఫీలు దిగుతూ సందడిగా గడిపారు.


ఎత్తిపోస్తున్న వరద నీరు

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు


ఝరి(బి) లోలెవల్ వంతెన వద్ద పరిశీలిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్


కుంటాల: ఓలా వద్ద లోతట్టు వంతెనను పరిశీలిస్తున్న తహసీల్దార్ కమల్ సింగ్


లోకేశ్వరం: సాథ్‌గాంలో లోలెవల్ వంతెన వద్ద తహసీల్దార్ సర్పరాజ్ నవాబ్, పోలీసులు


పేండ్‌పెల్లిలో వాగు ఉధృతి పరిశీలిస్తున్న సీఐ నైలు

- భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్

తానూరు: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఝరి(బి) గ్రామ లోలెవల్ వంతెనపై నుంచి వర్షపునీరు ప్రవహిస్తుండటంతో ఝరి(బి), ఝరి(బి)తండాతోపాటు మహారాష్ట్రలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలిసి శనివారం భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, ముధోల్ సీఐ మల్లేశ్ అక్కడకు చేరుకొని లోలెవల్ వంతెనను పరిశీలించారు. ఎస్సై షేక్ జుబేర్‌ను అడిగి పలు వివరాలు సేకరించారు. ఇద్దరు పోలీసులకు విధులు కేటాయించి.. ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని పేర్కొన్నారు.

శిథిల ఇళ్లల్లో ఉండొద్దు..

తానూరు: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఎవరూ ఉండొద్దని.. పశువుల కాపరులు చెరువులు, వంతెనల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో నసీరొద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరం ఉంటేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని.. లోతట్టు ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే అధికారులను సంప్రదించాలని సూచించారు.

కుంటాల: మండలంలోని ఓలా వద్ద ఉన్న లోతట్టు వంతెనను శనివారం తహసీల్దార్ కమల్‌సింగ్ పరిశీలించారు. సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. సూచిక బోర్డులు ఏర్పాటు చే యించి అధికారులకు సూచనలు చేశారు. ఆర్ఐ అడెల్లు, కార్యదర్శి యోగేశ్, సిబ్బంది శంకర్ ఉన్నారు.

బాసర: వాగులు, చెరువుల వద్దకు ప్రజలు వెళ్లొద్దని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎస్సై శ్రీనివాస్, రెవెన్యూ, పోలీసు, వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. బాసర పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్ తదితరులున్నారు.

లక్ష్మణచాంద: భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు చెరువులు, కుంటలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు, స్తంభాలకు దూరం ఉండాలని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. ఎవరూ చేపల వేటకు, పశువులను మేపేందుకు వెళ్లవద్దన్నారు. ఏవైనా ఇబ్బందులుంటే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సుద్దవాగు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

లోకేశ్వరం: సుద్దవాగు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సర్పరాజ్ నవాబ్ అన్నారు. సుద్దవాగును ఆనుకొని ఉన్న మండలంలోని హవర్గా, బిలోలి, సాథ్‌గాం గ్రామాలను శనివారం తహసీల్దార్, పోలీసులు సందర్శించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గడెన్నవాగు ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తివేయడంతో దిగువ ప్రాంతాలకు పశువుల కాపరులు, వ్యవసాయ కూలీలు వెళ్లవద్దని పేర్కొన్నారు. ఆర్ఐలు ప్రమోద్, లలిత, పోలీసులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని గుండెగాం, పేండ్‌పెల్లి గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. శనివారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి గుండెగాం వంతెన, సీఐ నైలు పేండ్‌పెల్లి వంతెనను పరిశీలించారు.

నూతన కార్యవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: శ్రీ శారద వెల్ఫేర్ అసోసియేషన్ 2001–02 పదో తరగతి బ్యాచ్ కార్యవర్గాన్ని శనివారం జిల్లాకేంద్రంలోని బాగులవాడలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆదుముల్ల శ్రీనివాస్, అధ్యక్షుడిగా వోడ్నాల వేదప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా అడప శ్యామ్, క్యాషియర్‌గా సిలారి సతీశ్‌కుమార్, సెక్రెటరీగా పురుషోత్తం, సలహా సభ్యులుగా రాజ్‌కుమార్, ఉమాకాంత్, రామకృష్ణ స్వయందర్, రాజేశ్, శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

బీసీ సంక్షేమ సంఘం..

నిర్మల్‌టౌన్: జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని శనివారం జిల్లాకేంద్రంలోని సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు పొన్నం నారాయణ గౌడ్ ప్రకటించారు. బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శులుగా పూదరి జనార్దన్, డాక్టర్ కత్తి కిరణ్, ఉపాధ్యక్షులుగా భోజన్న, విశాల్ సాయి, బట్టి లింబాద్రి, కార్యదర్శులుగా అంబదాస్, నరహరి, భోజన్న, రాజ మహేందర్, సహ కార్యదర్శులుగా సట్ల మహేశ్, సాయినాథ్, సంజు, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా పొన్నం రాహుల్‌గౌడ్ ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు


ఫాగింగ్ మిషన్ పనితీరును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సుదర్శన్

కుంటాల: వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో సుదర్శన్ సూచించారు. శనివారం కుంటాలలో ఫాగింగ్ మిషన్ ద్వారా దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మిషన్ పనితీరును పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజబాపు తదితరులు ఉన్నారు.


పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

నిర్మల్: నర్సాపూర్(జి)లోని పోలీస్‌స్టేషన్ వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. పంచాయతీ కార్యదర్శి కైలాస్ పారిశుద్ధ్య సిబ్బందితో మురుగు కాలువను శుభ్రం చేయించారు. పారిశుద్ధ్య పనులను ఎంపీఓ తిరుపతిరెడ్డి పరిశీలించారు. అనంతరం కేజీబీవీలో తరగతి గదుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు.


చెరువులు పరిశీలన

దిలావర్‌పూర్: మండలకేంద్రంలోని కొత్తచెరువు, మాల చెరువు, లింగోజీ చెరువులు పటిష్టంగా ఉన్నాయని ఆ గట్టుకు ప్రమాదం లేదని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో శనివారం చెరువుల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.


కొత్తచెరువు తూము పరిశీలిస్తున్న అధికారులు

శివలింగానికి ముస్లిం యువకుడి అభిషేకం

నిర్మల్: నర్సాపూర్(జి) మండలంలోని టెంబుర్ని గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీ చక్ర శివలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. గ్రామానికే చెందిన లతీఫ్ అనే ముస్లిం యువకుడు శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. భక్తులకు చాంద్‌బీ–లతీఫ్ దంపతులు అన్నదానం చేశారు. అన్నదాతను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభిషేకం చేస్తున్న లతీఫ్